
భవన నిర్మాణం జరుగుతున్న ప్రాంతం


ఎస్ఐ లోకేష్‌రెడ్డిని హెచ్చరిస్తున్న వెంకటేగౌడ

వైసీపీ నేతల దౌర్జన్యం

- రేకుల షెడ్డు స్థలంలో ఎమ్మెల్యే పీఏ భవన నిర్మాణం
- అక్రమమంటూ కూల్చబోయిన మాజీ ఎమ్మెల్యే
- పోలీసులతో వెంకటేగౌడ అనుచిత ప్రవర్తన
- బెల్టుషాపుల్లో మద్యం అమ్మిస్తున్నావంటూ ఎస్ఐపై ఆరోపణలు
- చేతనైతే నిరూపించాలన్న ఎస్ఐ

పలమనేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో మంగళవారం మధ్యాహ్నం ఉద్రిక్తత నెలకొంది.ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వ్యక్తిగత సహాయకుడు పార్థ గుడియాత్తం రహదారి పక్కన నిర్మించుకుంటున్న కట్టడం వద్దకు వైసీపీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ వచ్చారు. ఎక్స్‌కవేటర్ సాయంతో దాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. పార్థ నిర్మిస్తున్న భవన స్థలం రస్తా పొరంబోకు అని, ఈ కట్టడం కిందే కౌండిన్య రిజర్వాయర్ నుంచి వచ్చే మంచినీటి పైపులైను ఏర్పాటు చేయబడిందని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ నిర్మాణం అక్రమమని స్థానికులు మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఆర్డీవోకు, కలెక్టరుకు ఫిర్యాదు చేశారన్నారు. అయినా నిర్మాణం ఆగలేదని తెలిసి తాను ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణంకోసం నిర్మించిన గోడలను ఎక్సకవేటర్ సాయంతో కూల్చేందుకు పూనుకోవడంతో ఈ సమాచారం తెలిసి ఎస్ఐ లోకేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ తాను కమిషనర్‌కు ఫోన్ చేయగానే పోలీసులు వచ్చారని , లా అండ్ ఆర్డర్ సమస్య ఉన్నప్పుడు రాని పోలీసులు ఇక్కడ ఏమీ జరక్కపోయినా వచ్చారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీంతో ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఎక్కడ శాంతి భద్రతలు సమస్య తలెత్తినా తాము వస్తామని, ఇందులో ఎవరి అభ్యర్థనలూ అవసరం లేదన్నారు. సమస్య స్థలం గురించి అయితే అంతవరకే మాట్లాడాలని మాజీ ఎమ్మెల్యేకు సూచించడంతో కొంత వాగ్వాదం చోటు చేసుకుంది.బెల్టుషాపుల్లో అక్రమంగా మద్యం అమ్మిస్తున్నావంటూ ఎస్ఐ లోకేష్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే చేసిన వాఖ్యలతో ఎస్ఐ తీవ్రంగా స్పందించారు. బెల్టుషాపుల్లో మద్యం అమ్మిస్తున్నట్లు రుజువు చేస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోతానన్నారు. బెల్టుషాపు నడుపుతున్న వ్యక్తిని పట్టుకుంటే వదిలిపెట్టమని ఫోన్ చేసిన విషయం గుర్తులేదా అని వెంకటేగౌడను ప్రశ్నించారు.అలాంటి వ్యక్తివి బెల్టుషాపుల్లో మద్యం అమ్మిస్తున్నానని తనెలా మాట్లాడతావంటూ నిలదీశారు. బెల్టుషాపుల్లో మద్యం అమ్మించివుంటే తనకు 10 బదిలీలు వచ్చేవి కాదని, ఒకేచోట నాలుగు సంవత్సరాలు బదిలీ లేకుండా పనిచేసేవాడినని చెప్పారు. అనవసరంగా పోలీసులపై నిందారోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.దీంతో వైసీపీ నాయకులు ఎస్ఐని చుట్టుముట్టి దౌర్జన్యకరంగా ప్రవర్తించారు.ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడను వైసీపీ నాయకులు పక్కకు తీసుకెళ్లిపోయారు. అనంతరం ఆర్డీవో భవానితో మాజీ ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు.అక్రమ నిర్మాణ విషయం ఏమైందని ప్రశ్నించగా ఇప్పటికే పనులు ఆపేయమని తాము ఆదేశించడం జరిగిందని ఆమె సమాధానమిచ్చారు. ఆదేశాలు ఇచ్చివుంటే ప్రస్తుతం శ్లాబ్ వేసే స్థాయికి నిర్మాణం ఎలా జరిగిందని వెంకటేగౌడ ప్రశ్నించారు.తరువాత మున్సిపల్ అధికారులతో వెంకటేగౌడ మాట్లాడగా తాము చర్యలు తీసుకుంటామని వారు సమాధానం ఇచ్చారు.మంగళవారం సాయంత్రం వరకు వేచిచూస్తామని, పట్టించుకోకపోతే తామే నిర్మాణాలు తొలగిస్తామని వెంకటేగౌడ చెప్పారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున జనం గుమికూడటంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయమై ఆర్డీవోను వివరణ కోరగా ఆ స్థలానికి సంబంధించి 2007లో రెవెన్యూ అధికారులు అనుభవ సర్టిఫికెట్ ఇచ్చారని, దీంతో అక్కడ రేకుల షెడ్డు వేసుకొనేందుకు మున్సిపల్ అధికారులు అనుమతి ఇచ్చారని వివరించారు. అయితే ఆ స్థలంలో పక్కా భవన నిర్మాణం జరుగుతున్నట్లు తెలియడంతో ఆపివేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఆర్డీవో తెలిపారు.

వైసీపీ నేతలపై మూడు కేసులు

మాజీ ఎమ్మెల్యేతో పాటు వైసీపీ నాయకులపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. పార్థ అనే నిర్మిస్తున్న భవన నిర్మాణం కూల్చేందుకు ప్రయత్నించడంతో పాటు ఎస్ఐ లోకేష్ పట్ల దురుసుగా ప్రవర్తించిన వెంకటేగౌడతో పాటు వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా పార్థ సోదరుడు పవన్ ఫిర్యాదు మేరకు, పార్థ ఫిర్యాదు మేరకు మరో రెండు కేసులు నమోదు చేశారు.

పక్కా రికార్డులున్నా దౌర్జన్యం చేశారు


పార్థ

తాను నిర్మిస్తున్న భవన స్థలానికి సంబంధించి పక్కా రికార్డులున్నా మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడు దౌర్జన్యంగా వ్యవహరించారని ఎమ్మెల్యే సహాయకుడు పార్థ తెలిపారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే తన స్థలం వద్దకు వచ్చి నిర్మించిన గోడలను కూల్చేందుకు విఫలయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.వైసీపీ హయాంలో ఆయన, ఆ పార్టీ నేతలు ఎటువంటి దౌర్జన్యాలు, అక్రమాలు చేశారో ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. తన తల్లి 1998 నుంచి ఇక్కడే అంగడి పెట్టుకొని జీవనం సాగించేదని, ఆమె పేరున ప్రభుత్వం పట్టా కూడా ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మున్సిపల్ కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చి ఆ దుకాణాన్ని తొలగించే యత్నం చేయగా తాను హైకోర్టును ఆశ్రయించి అన్ని రికార్డులు పొందానన్నారు. భవన నిర్మాణానికి మున్సిపల్ అధికారుల అనుమతే కాదు మున్సిపల్ ప్లాన్ అప్రూవల్ కూడా తెచ్చుకొన్నానని కాపీలు కూడా చూపించారు. మున్సిపాలిటీకి కట్టిన పన్ను రశీదులు కూడా చూపించారు.ఒక వేళ తాను అక్రమంగా నిర్మాణాలు చేసి వుంటే అధికారులకు ఫిర్యాదు చేస్తే వారే నిర్ధారించేవారని, అలా కాకుండా భవన నిర్మాణాన్ని కూల్చే యత్నం ఎలా చేస్తావని మాజీ ఎమ్మెల్యేని ప్రశ్నించారు. పేదల కాలనీల్లో వైసీపీ నేతల అక్రమాలు చాలా వున్నాయన్నారు.

టీడీపీ నేత కుటుంబంపై మారణాయుధాలతో దాడి

వైసీపీ సర్పంచ్ భర్త, ఫీల్డ్ అసిస్టెంట్ సహా ఐదుగురి అరెస్టు


గాయపడ్డ భారతి, జానీ, మార్కొండయ్య


ప్రధాన ముద్దాయి ఏకాంబరం


నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

వెదురుకుప్పం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో పరస్పరం అసభ్యకర వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టుకోవడంతో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుడు ఆనందరావు ఇంటిపై వైసీపీ సర్పంచ్ భర్త ఏకాంబరం, ఫీల్డ్ అసిస్టెంట్ లోకేశ్ తదితరులు మారణాయుధాలతో దాడికి పాల్పడి గాయపరచడమే కాకుండా ఇంటి తలుపులు ధ్వంసం చేశారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటన ఎస్ఆర్‌పురం మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది.పొదలపల్లి కాలనీకి చెందిన వెంకటాపురం సర్పంచ్ భర్త ఆర్.ఏకాంబరం, ఆర్.భరత్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్.లోకేశ్, ఎం.రాజేష్, ఆర్.చరణ్ మారణాయుధాలతో అదే కాలనీకి చెందిన ఆనందరావు ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో ఆనందరావుతో పాటు కుటుంబీకులైన మార్కొండయ్య, భారతి, జానీలకు గాయాలయ్యాయి. ఇంటి తలుపులు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం ముద్దాయిలు ఏకాంబరం, భరత్, లోకేశ్, రాజేష్, చరణ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు సుమన్, చిన్నరెడ్డప్ప తెలిపారు. సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు.అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, కామెంట్లు చేయడం నేరమని , ఇలాంటి చర్యలపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోజంతా ముసురు వాన

- మరో మూడురోజులు వర్ష సూచన


చిత్తూరులో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):ఈశాన్య రుతుపవనాలు.. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లావ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది.ఉదయం నుంచే అప్పుడప్పుడూ జల్లులు కురుస్తుండడంతో జనం ఇండ్లకే పరిమితమయ్యారు. గడిచిన 24 గంటల్లో 28 మండలాల్లో వర్షాలు కురిశాయి.అత్యధికంగా విజయపురంలో 20.2 మిమీ,అత్యల్పంగా యాదమరిలో 1.8 మిమీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా... గుడిపాలలో 14.2, ఐరాలలో 13.2, పూతలపట్టులో 9.4, పెద్దపంజాణిలో 9.2, పాలసముద్రంలో 8.6, పులిచెర్లలో 7.6, గంగాధరనెల్లూరులో 8.2, పలమనేరు, సోమల మండలాల్లో 6.8, పెనుమూరులో 6.2, చిత్తూరు అర్బన్‌లో 6, రొంపిచెర్లలో 5.8, గంగవరం, ఎస్ఆర్‌పురం,నదుం మండలాల్లో 5.4, వెదురుకుప్పంలో 5.2, నగరిలో 4.8, వి.కోటలో 3.8, బంగారుపాళ్యంలో 3.4, తవణంపల్లెలో 3.2, బైరెడ్డిపల్లెలో 2.8, కార్వేటినగరంలో 2.6, రామకుప్పంలో 2.2, చౌడేపల్లె, పుంగనూరుల్లో 2 మిమీ వర్షం కురిసింది.మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని మండలాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది.


ఎర్రజేనులో వరుసగా కురుస్తున్న చినుకులకు నేలకొరిగిన వరిపంట

వర్షాలకు దెబ్బతిన్న వరిపంట

యాదమరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలోని మంగధానపల్లి పంచాయతీలో వరుసగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా వరిపంట తీవ్రంగా దెబ్బతింది. ఎర్రజేను గ్రామానికి చెందిన బాబు ఆచారి, కోదండ ఆచారి, రాజశేఖర్ ఆచారి సాగుచేసిన మూడు ఎకరాల వరిపంట పూర్తిగా నేలకొరిగింది. అలాగే ఐరాల మండలం వీఎస్.అగ్రహారంలో కూడా వరి పంట నేలకొరిగింది.

నేడు విద్యాసంస్థలకు సెలవు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశమున్నందున పాఠశాలలకు, విద్యా సంస్థలకు బుధవారం సెలవు దినంగా ప్రకటించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున రాష్ట్రప్రభుత్వం చిత్తూరు జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. అనధికారికంగా ఎక్కడైనా విద్యా సంస్థలు నిర్వహిస్తే విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

అమర వీరుల కుటుంబాలకు అండగా నిలవాలి


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జి అరుణ, ఎస్పీ, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు



అమరవీరుల కుటుంబ సభ్యురాలిని సన్మానిస్తున్న జడ్జి అరుణ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి అరుణ, ఎస్పీ తుషార్ డూడి, కలెక్టర్ సుమిత్‌కుమార్ కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వు పెరేడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి అరుణ మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సే పరమావధిగా ముందుకు వెళ్లే పోలీసులు అక్కడక్కడా అల్లరిమూకల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.అలాంటి అమరవీరులను స్మరించుకోవడం, అండగా నిలబడడం మన బాధ్యత అన్నారు.ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ అమరవీరుల ధైర్యం, క్రమశిక్షణ ప్రతి పోలీసుకూ ఆదర్శప్రాయమన్నారు.వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని పోలీసుశాఖ పనిచేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న పోలీసు దళాలపై జరిగిన దురదృష్టకర సంఘటనను గుర్తు చేసుకుంటూ వారి త్యాగాలను ఏటా స్మరించుకుంటున్నామన్నారు.శాంతి భద్రతలను కాపాడడంలో విశేష కృషి చేస్తున్న పోలీసుల సేవలను మనం గుర్తుంచుకోవాలన్నారు.అనంతరం అమరవీరుల కుటుంబాల వారిని సన్మానించారు.ఏఎస్పీలు రాజశేఖర రాజు, శివానంద కిశోర్, డీఎస్పీ సాయినాథ్, డీటీసీ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాష, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

కిడ్నాప్ చేసి చిత్రహింసలు

ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు


బాధితుడు మణిరత్నం


నిందితులు పరమేశ్వరన్, రాజ్‌కుమార్

యాదమరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అప్పడిగితే ఇస్తామని నమ్మించి...వచ్చాక కిడ్నాప్ చేసి, చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా డబ్బులు దోచుకున్న కేసులో ఇద్దరిని యాదమరి పోలీసులు అరెస్టు చేశారు.ఎస్ఐ ఈశ్వర్ కథనం ప్రకారం.... తమిళనాడు రాష్ట్రం కల్లకురిచ్చికి చెందిన మణిరత్నం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఆర్థిక ఇబ్బందుల పాలయ్యాడు.దీంతో తనకు పరిచయస్తుడైన తమిళనాడుకు చెందిన పరమేశ్వరన్‌కు ఫోన్‌చేసి రూ.20 లక్షలు అప్పుగా తీసివ్వాలని కోరాడు. దీనికి ప్రతిగా రెండు శాతం కమీషన్ ఇస్తానని చెప్పాడు.పరమేశ్వరన్ రమ్మనడంతో ఈ నెల 16వ తేదిన మణిరత్నం కుప్పం వచ్చాడు. అక్కడున్న పరమేశ్వరన్‌తో కలిసి కారులో చిత్తూరుకు చేరుకున్నాడు.అక్కడ పరమేశ్వరన్ స్నేహితుడైన రాజ్‌కుమార్‌తో కలిసి వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లి సమీపంలో ఉన్న ఒక క్వారీ యజమాని వద్దకు వెళ్లారు.అక్కడ మణిరత్నాన్ని బంధించి తీవ్రంగా దాడిచేశారు.మణిరత్నం మొబైల్ ఫోన్ ద్వారా రూ.2,33,000 మొత్తాన్ని పలు దఫాలుగా పరమేశ్వరన్‌కు తెలిసినవారి మొబైల్ నెంబర్లకు బలవంతంగా బదిలీ చేయించారు. డబ్బులు బదిలీ అయిన తర్వాత కూడా అతడిని వదల్లేదు. 18వ తేది రాత్రి యాదమరి మండలం భూమిరెడ్డిపల్లె సమీపంలోని నుంజర్ల ప్రాజెక్టు వద్దకు తీసుకొచ్చారు.అక్కడ నీటిలో కూర్చొబెట్టి సిగరెట్లతో కాలుస్తూ విచక్షణారహితంగా హింసించారు. ఈ క్రమంలో మణిరత్నం తలకు గాయాలు కూడా అయ్యాయి. మరిన్ని డబ్బులకోసం మణిరత్నాన్ని తీవ్రంగా వేదించారు.19వ తేదీ ఉదయం చిత్తూరుకు తీసుకెళ్తున్న సమయంలో టీ తాగేందుకు కారును ఆపినప్పుడు మణిరత్నం తప్పించుకున్నాడు. తన బంధువులకు జరిగిన విషయం తెలియజేసి, 20వ తేదిన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం పరమేశ్వరన్,రాజ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. కాగా పరమేశ్వరన్‌పై శాంతిపురం మండలం రాళ్ళబూదుగూరులో 2023లో కిడ్నాప్ కేసు, రాజ్‌కుమార్‌పై చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో 2021లో హత్యాయత్నం కేసులు గతంలో నమోదయ్యాయి.

సీడీసీఎంఎస్ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(సీడీసీఎంఎస్)కు అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జిగా జాయింట్ కలెక్టర్ విద్యాధరిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ఏడాది డిసెంబరు 26వ తేదీ వరకు లేదా తిరిగి ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఆ పదవిలో ఆమె కొనసాగుతారు. కాగా సీడీసీఎంఎస్‌కు ప్రభుత్వం చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఐతేపల్లె సింగిల్‌విండో త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడిని నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జీ కమిటీ చైర్మన్‌గా గతంలో నియమించింది. ఈయన గత నెల 16న అనారోగ్యం కారణంగా చనిపోయిన విషయం తెలిసిందే.

వేడుకగా గౌరీవ్రతం



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో కొలువైన మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కేదారినాథగౌరీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు.పరిసర గ్రామాలకు చెందిన మహిళలు హాజరయ్యారు. అలాగే ఆలయంలో మణికంఠేశ్వరునికి విశేష పూజలు చేశారు.ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ పాల్గొన్నారు.

పుంగనూరు టీచర్‌కు అవార్డు


రబ్బాని

పుంగనూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం ఇస్లాంనగర్‌లోని ఉన్నత పాఠశాలలో గణితశాస్త్రం బోధిస్తున్న రబ్బాని నేషనల్ ఉర్దూ టీచర్స్ అవార్డుకు ఎంపికయ్యాడు. దేశ వ్యాప్తంగా విశిష్ట సేవలు అందించిన ఉర్దూ ఉపాధ్యాయులను క్వామీ ఉర్దూ శిక్షక్ కర్మచారి సంఘ్ ఇండియా గుర్తించినట్లు ఆయన తెలిపారు. అవార్డును ఈనెల 26న ఢిల్లీలోని గాలిబ్ అకాడమీ ఆధ్వర్యంలో అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

10 నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు నవంబరు 10 నుంచి 19వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నారు. ఆగస్టు 4 నుంచి 7 వరకు ఫార్మేటివ్ అసెస్మెంట్-1, అక్టోబరు 13 నుంచి 16వ రకు ఫార్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ రెండు పరీక్షల్లోని సిలబస్ ఆధారంగా నవంబరు నెలలో సమ్మేటివ్ అసెస్మెంట్-1 (అర్ధ సంవత్సరం) పరీక్షలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా 2026 మార్చి 16 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో టెన్త్ విద్యార్థులు నామినల్ రోల్స్ నమోదు చేసుకోవాల్సి ఉంది.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మె



చిత్తూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న సమ్మె పండగరోజూ కొనసాగింది. సోమ, మంగళవారాల్లో కూడా డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 21 రోజులుగా వైద్యులు ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహ రిస్తోందని విమర్శించారు. 24 ఏళ్లుగా విధులు నిర్వహిస్తుంటే ప్రమోషన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఎన్ని రోజులైనా తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ధర్నా చేస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


విరాళ రశీదును అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన ట్రస్టుకు చిత్తూరుకు చెందిన మోహన్‌కుమార్ మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం దాతను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరసిద్ధుడి గ్రామోత్సవం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వ దినాన్ని పురస్కరించుకుని కాణిపాకంలో సోమవారం రాత్రి వరసిద్ధునికి వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా దీపావళికి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లను కాణిపాక పుర వీధులలో ఊరేగించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి ఘన నివాళులు


రాజగోపాల నాయుడికి నివాళులర్పిస్తున్న గల్లా కుటుంబీకులు

తవణంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తండ్రి మాజీ ఎంపీ స్వర్గీయ పాటూరి రాజగోపాల్‌నాయుడు వర్ధంతిని మండలంలోని దిగువమాఘం రాజన్న పార్కులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజన్న పార్కులో గల రాజగోపాల్‌నాయుడు శిలా విగ్రహానికి మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజ వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు, మాజీ ఎంపీ, అమరరాజ చైర్మన్ గల్లా జయదేవ్, రమాదేవి, గౌరినేని విక్రమాదిత్య, కుటుంబ సభ్యులు మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపి, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, సతీష్, సురేష్, దిగువమాఘం గ్రామస్థులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంటలపై గజరాజుల బీభత్సం

వర్షంలోనూ ఆగని ఏనుగుల గుంపు దాడులు ● వరి, టమోటా, మామిడి, కొబ్బరి పంటలకు నష్టం

కల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై రోజూ గజ రాజులు బీభత్సం సృష్టిస్తూనే ఉన్నాయి. రెండు రోజులుగా వర్షం కురుస్తున్నా పంటలపై ఏనుగుల గుంపు దాడులు ఆగడం లేదు. రాత్రి, పగలు తేడా లేకుండా జడివాన కురుస్తుండటంతో అడవి నుంచి పంటలను ధ్వంసం చేసేందుకు వచ్చే ఏనుగులను కట్టడి చేసేందుకు సిబ్బందికి కష్టతరంగా మారింది. మండలంలోని దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీల్లో సోమవారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేయడంతో వరి, టమోటా, కొబ్బరి, మామిడి, అరటి పంటలకు అపారనష్టం వాటిల్లింది. సోమవారం రాత్రి తూర్పు విభాగం అడవిలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఏడు ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి సమీపంలోని వెంకటమ్మ చెరువు వద్దకు చేరుకున్నాయి. బసవయ్యకు చెందిన మామిడి, టమోటా పంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు అక్కడే పేడదిబ్బలు వేసి నానా బీభత్సం సృష్టించాయి. రమణమ్మ, శాంతమూర్తికి చెందిన వరి పంటను ధ్వంసం చేసిన ఏనుగులు రెడ్డెప్పరెడ్డికి చెందిన కొబ్బరి, మామిడి, మునగ, అలసంద పంటలను ధ్వంసం చేసి అపారనష్టం కలిగించాయి. అక్కడి నుంచి గెండేవారిపల్లి వద్దకు చేరుకొని రవికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి ఏడు ఏనుగుల గుంపులో ఐదు ఏనుగుల గుంపు అడవివైపు వెళ్లిపోగా మిగిలిన రెండు ఏనుగులు కమ్మపల్లి పంచాయతీ దిన్నె వద్దకు చేరుకున్నాయి. సురేంద్రరెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డిలకు చెందిన వరి పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి అడవిలోకి చేరుకున్న జంట ఏనుగులు అప్పటికే అడవిలోకి చేరుకున్న ఐదు ఏనుగుల గుంపులో కలిసిపోయాయి. మంగళవారం పగలంతా అడవిలోని చాకలికోన సమీపంలో ఏడు ఏనుగుల గుంపు తిష్ఠ వేసినట్లు ప్రజలు తెలిపారు. అంతకు ముందురోజు ఆదివారం రాత్రి దేవళంపేట పంచాయతీ కుమ్మరపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు రమణ, ధర్మేంద్ర, వెంకటాచలం, మధు, చెంగ్రాయులు, రామయ్య, సీతాప్రసాద్‌కు చెందిన మామిడి, వరి, కొబ్బరి పంటలను ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన పంటలను మంగళవారం ఉదయం ఏఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, మధు పరిశీలించారు. బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - ధ్వంసమైన మామిడి, టమోటా పంట

నేడు అపోలో వర్సిటీకి హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు

చిత్తూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర శివార్లలోని మురకంబట్టులో ఉన్న అపోలో యూనివర్సిటీకి బుధవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి రానున్నారు. ఇటీవల యూనివర్సిటీలో చోటుచేసుకున్న సంఘటనలపై ఆమె విచారించనున్నట్లు తెలుస్తోంది. గతంలో హాస్టల్ మెస్‌లో జరిగిన ఫుడ్‌పాయిజన్ , ఓ విద్యార్థి ఆత్మహత్య , ఇటీవల లేడీస్ టాయిలెట్‌లో హిడెన్ కెమెరా బయటపడడం వంటి ఘటనలకు సంబంధించి యాజమాన్యం సరైన చర్యలు తీసుకోలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. దీనిపై ఇదివరకే అపోలో చైర్మన్‌కు కూడా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని కొంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారని సమాచారం.ఈ క్రమంలోనే విచారణకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు వస్తున్నట్లు తెలుస్తోంది.

పెరుమాళ్లపల్లెలో కూలీపై దాడి



వెదురుకుప్పం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూలి పనికి వెళితే తనపై మారణాయుధంతో దాడికి పాల్పడ్డాడంటూ పోలీసులకు వెంకట్రమణా రెడ్డి అనే వ్యక్తి సోమవారం ఫిర్యాదు చేశారు.బాధితుడి ఫిర్యాదు ప్రకారం... వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన బి.కృష్ణయ్య ఇంటి వద్దకు రాతి కూసాలు నాటడానికి బి.శ్రీరాములురెడ్డి, కె.హరీష్‌రెడ్డితో కలిసి వెంకట్రమణా రెడ్డి వచ్చారు. అయితే అదే వూరికి చెందిన బి.అల్లికార్జునరెడ్డి నిష్కారణంగా మారణాయుధంతో వచ్చి వెంకట్రమణా రెడ్డి పై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ విషయమై సోమవారం వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశామని, తమపై దాడికి పాల్పడిన అల్లికార్జున్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వెంకట్రమణా రెడ్డి కోరారు.

వృద్ధురాలికి బురిడీ : బంగారు చైను చోరీ

పాకాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో వృద్ధురాలిని మోసగించి బంగారు చైను అపహరించిన వైనమిది. గాదంకి పంచాయతీ బత్తినవారిపల్లెకు చెందిన కమలమ్మ అనే వృద్ధురాలు మంగళవారం ఆర్టీసీ బస్సులో పాకాలకు వచ్చింది. బస్సులో దొంగలున్నారని, బంగారు చైను తీసి బ్యాగులో పెట్టుకోవాలని ఇద్దరు మహిళలు ఆమెకు సలహా ఇచ్చారు. అందులోని ఓ మహిళ తాను చైను బ్యాగులో పెట్టుకున్నానంటూ నమ్మబలికి కమలమ్మ మెడలోని మూడు సవరాల చైను తీసి బ్యాగులో పెడుతున్నట్టుగా నటించింది. గిల్టు చైను బ్యాగులో పెట్టి బంగారు చైను తీసుకొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎ.రంగంపేటలోనూ గజ దాడులు


దాడిలో ధ్వంసమైన అరటి చెట్లు

చంద్రగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట పరిధిలో సోమవారం తెల్లవారుజామున విజయ్‌కుమార్ పొలంలో ఏనుగులు దాడిచేశాయి. అరటి చెట్లు, కొబ్బరి చెట్లు, గడ్డి,పెన్సింగ్, బోర్ మోటార్ పైపులను ధ్వంసం చేశాయి. గ్రామస్తులు భయాందోళన చెందారు. అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు. అటవీ అధికారులు అక్కడికి చేరుకుని రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని రైతులను అప్రమత్తం చేశారు. మంగళవారం రాత్రి కందులవారిపల్లి, నారావారిపల్లి, నాగపట్ల, కళ్యాణిడాం వీటీసీ, రంగంపేట ప్రాంతాలలో కూడా సంచరించే అవకాశం ఉందని చెబుతున్నారు.

తిరుపతిలో నకిలీ టీటీఈ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ టీటీఈని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జీఆర్‌పీఎఫ్ సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కన్నదాసన్ నగర్‌కు చెందిన జితేంద్ర షా తిరుపతిలో టీటీఈగా అవతారం ఎత్తాడు. రైళ్లలో దిగుతున్న ప్రయాణికులను టార్గెట్‌గా చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఇతడిపై రెండు రోజుల క్రితం అందిన ఫిర్యాదుతో నిఘా పెట్టారు. ఈ క్రమంలో గేటు నెంబరు 3 వద్ద ప్రయాణికుల వాగ్వాదంతో పోలీసులు వెళ్లి విచారించారు. తన వద్ద సరైన టికెట్ లేకపోవడంతో రూ.వెయ్యి జరిమానా వేశారని, తన వద్ద రూ.500 తీసుకుని రసీదు ఇవ్వలేదని ఓ ప్రయాణికుడు చెప్పారు. మిగతా రూ.500 కోసం బెదిరిస్తున్నాడని తెలిపారు. నగదు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు పోలీసులు విచారించగా తాను టికెట్ కలెక్టర్‌నని చెప్పాడు. అతడి వద్ద గుర్తింపు కార్డు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. రైల్వే జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ రత్నమాల కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రరాయ్, ఢిల్లీ రాష్ట్ర హోంమంత్రి ఆశీష్‌సుద్ కుటుంబ సమేతంగా మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

అనుమతి లేకుండా టపాకాయల విక్రయం..ఒకరి అరెస్టు


టపాకాయలు విక్రేతను అరెస్టు చూపుతున్న పోలీసులు

బంగారుపాళ్యం,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని తుంబకుప్పం గ్రామంలో ఉన్న ఎంపీపీ ప్రభుత్వ పాఠశాలలో గంగాధర నెల్లూరు మండలం అప్పిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు దుర్వాసులు ఎలాంటి లైసెన్సు లేకుండా టపాకాయలు అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు మంగళవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.70 వేల విలువైన టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది మోహన్, ద్వారకనాథ్, ఫ్రాంక్లిన్, ఉదయ్ ఉన్నారు.

పుట్టింటికి వెళ్తూ.. పరలోకానికి..!


భారతి మృతదేహం

రామకుప్పం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం-పలమనేరు జాతీయ రహదారిపై రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం దంపతులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వేగంగా వస్తున్న సుమో ఢీకొనడంతో భార్య అక్కడికక్కడే మృతిచెందగా.. భర్తకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వి.కోట మండలం కరిప్పల్లెకు చెందిన రమేష్‌రెడ్డి(40), భారతి(36)లు మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంలో శాంతిపురం మండలం నాయనపల్లెలోని భారతి పుట్టింటికి బయలుదేరి వెళ్లారు. మార్గంమధ్యలో కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె సమీపంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న సుమో ద్విచక్రవాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. భారతికి తలపై బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. రమేష్‌రెడ్డి తీవ్రగాయాలపాలయ్యాడు. 108 వాహనంలో రమేష్‌రెడ్డిని కుప్పం ఆస్పత్రికి తరలించారు. రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టపాసుల దుకాణం వద్ద ఘర్షణ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం కట్టమంచి సమీపంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. 48వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఈశ్వర్ తమ్ముడి కుమారుడు టపాసులు కొనేందుకు ఇక్కడికి వచ్చి 6వ వార్డు డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి మౌళి దుకాణంలోని టపాసుల్ని దొంగలించినట్లు, దీంతో మౌళి అతన్ని మందలించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తన పెద్దనాన్నకు చెప్పగా, ఈశ్వర్ అక్కడికి చేసుకున్నారు. ఇద్దరి మధ్య కాసేపు వాగ్వాదం జరిగాక, చిన్నపాటి ఘర్షణ కూడా జరిగింది. ఈశ్వర్ ప్రభుత్వాసుపత్రిలో చేరగా, పరీక్షించిన వైద్యులు ఏం కాలేదని ఇంటికి పంపించేశారు. ఈ విషయాన్ని కొందరు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయగా, పోలీసు అధికారులు తొలగించారు.

ముక్కంటి ఆలయంలో పాము కలకలం

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం పాము కలకలం రేపింది. ఆలయంలోని అమ్మవారి సన్నిధి వద్ద ఉన్న రాతి కట్టడం సమీపంలో పాము భక్తుల మధ్యకు చొరబడింది. కాసేపు భక్తులు భయాందోళన చెందారు. అటవీశాఖ సిబ్బంది సాయంతో పామును పట్టుకుని కైలాసగిరి అటవీ ప్రాంతంలో విడచిపెట్టారు.

శాస్త్రోక్తంగా దీపావళి ఆస్థానం


గోవిందరాజస్వామి ఆలయంలో నూతన వస్త్రాలను శ్రీవారికి అలంకరించడానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న పెద్ద జీయర్ స్వామి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయంలో సోమవారం దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి ఆలయంలో పుండరీకవల్లి అమ్మవారి సన్నిధి నుంచి సాయంత్రం నూతన వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీవారికి సమర్పించారు. అనంతరం దీపావళి ఆస్థానం వైభవంగా నిర్వహించారు. పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఏఈవో ఏబీఎస్ చౌదరి, సూపరింటెండెంట్ చిరంజీవి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. గోవిందరాజస్వామి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, దోశపడి, దీపాలు తీసుకొచ్చి కోదండరామస్వామికి సమర్పించారు. అనంతరం దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది.

తిరుపతి జిల్లాలో జోరు వాన

- పది మండలాల్లో భారీగా.. మరికొన్ని చోట్ల మోస్తరు
- వడమాలపేటలో చెరువుకు గండి
- కోటలో తెగిపడిన విద్యుత్ తీగలు
- సముద్రంలో వేట నిలిపివేత



బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు వద్ద పందికాలువలో నీటి ఉధృతితో రాకపోకలు ఆపేసిన అధికారులు - వెంకటగిరి వద్ద కౌవల్యానది ప్రవాహం


వడమాలపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగ కొత్తచెరువుకు సోమవారం పడిన గండి

తిరుపతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు.. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. ఈశాన్య రుతుపవనాల ప్రభావానికి తోడు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడడంతో పది మండలాల్లో భారీ వర్షాలు మరో 14 మండలాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లావ్యాప్తంగా సగటున 32.9 మిల్లీమీటర్ల వర్షం పడిది. అన్ని చోట్ల చెరువుల్లోకి నీరు చేరుతోంది.

- వడమాలపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగ పంచాయతీ ఎస్టీ కాలనీ కొత్త చెరువుకు సోమవారం మధ్యాహ్నం గండి పడింది. మంగళవారం సాయంత్రానికి గండి పూడ్చారు.
- బాలాయపల్లి మండలం జయంపు చెరువు కలుజు వద్ద కట్ట కోతకు గురైంది.
- భారీ వర్షం, ఈదురుగాలులతో కోటలోని ఆరాధ్య థియేటర్ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో జనం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.
- వాకాడు, కోట మండలాల పరిధిలో అలలు ఎగిసిపడి సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచే మత్స్యకారులు చేపల వేట నిలిపివేశారు.
- పెళ్లకూరు మండలం జీలపాటూరు వద్ద ఎల్డీ పైర్లలో వర్షపు నీరు చేరింది.
- శ్రీకాళహస్తి, నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలోకి నీరు చేరుతోంది.
- తిరుపతిలో సోమవారం మోస్తరు వాన పడగా మంగళవారం జడివాన పట్టుకుంది. రోజంతా ఏదో ఒకస్థాయిలో వర్షం పడుతూనే వుంది.


ఏర్పేడు మండలం గుడిమల్లం నుంచి భక్తులను సీతకాలువ వద్ద వద్ద ట్రాక్టరులో దాటిస్తున్న ఆలయ నిర్వాహకులు

నిండుకుండలా పులికాట్



నిన్నా మొన్నటి వరకు నీళ్లలేక వెలవెలబోయిన పులికాట్ సరస్సు. రెండు రోజుల వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. వర్షపు నీటితో పాటు కాళంగి, పాముల కాలువల నుంచి సరస్సుకు భారీగా నీరింది. దీంతో పులికాట్ తీరం వెంబడి సముద్రాన్ని తలపించేలా నీటి అలలు ఎగసిపడుతున్నాయి. మరో రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మత్స్యకారులు పులికాట్‌లో వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కేజీబీవీ విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

రొంపిచెర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల కేజీబీవీ విద్యార్థుల కోసం పాఠశాలకు దేవులపల్లె రాజమ్మ, చెంగల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు హేమవెంకట రమణారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం రూ. 30 వేలు ఆర్థిక సాయం అందించారు. విద్యార్థులు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలు పెంచుకునేందుకు కుట్టుమిషన్లు కొనుగోలు చేయాలని దాత పాఠశాల ప్రిన్సిపాల్‌ను కోరారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు శ్రావ్య , దివ్య, ఉపాధ్యాయులు మౌర్యారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఆలయ దర్శనాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

పలమనేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఆలయాలను దర్శించుకునేందుకు భక్తుల కోసం ఓ ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ అల్తాఫ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 27, నవంబరు 3, 10, 17వ తేదీల్లో ఈ సర్వీసు లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారాల్లో ఉదయం 6 గంటలకు పలమనేరు ఆర్టీసీ బస్టాండు నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు బయలుదేరి మొగిలిలోని మొగిలీశ్వరస్వామి ఆలయం, అక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, కురుడుమల గణేష్ ఆలయం, అక్కడి నుంచి బంగారు తిరుపతిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, కోటిలింగాలు ఆలయాలు దర్శించుకొని అదేరోజు సాయంత్రం పలమనేరుకు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ.425, పిల్లలకు రూ. 250 టిక్కెట్ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు డిపో మేనేజర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లను సంప్రదించాలన్నారు. ఫోన్‌నంబరు 9490837188 ను సంప్రదించి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్పంచ్ విశ్వనాథ్‌కు ఎమ్మెల్యే పరామర్శ



భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం బోడిగుట్టపల్లె సర్పంచ్ విశ్వనాథ్ తల్లి గౌరమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. సమాచారం అందుకున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ నాయకులు రాంబాబు, సోము, కృష్ణప్ప, రామ్మూర్తి, ధీరజ్‌లతో కలిసి దొడ్డిపల్లెకు గ్రామానికి చేరుకొని ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు శబరీష్, భక్తా, మూర్తి, ఆనంద్, సుబ్రహ్మణ్యం, భాస్కర్, నాగరాజ్, ప్రకాష్, దయాసాగర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాళ్లగంగమాంబ ఊంజల్‌సేవ



గుడుపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రైల్వేస్టేషన్ క్రాస్‌లో కొలువైన రాళ్లగంగమాంబ ఆలయంలో సోమవారం వైభవంగా ఊంజల్ సేవ జరిగింది. ఆలయ అర్చకులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద పండితులు అమ్మవారి ఊంజల్ సేవను నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సింగసముద్రంలో రక్త నమూనాల సేకరణ



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

రామకుప్పం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల సింగసముద్రం గ్రామంలో మంగళవారం విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో ఉచిత రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కృష్ణప్ప, యువనేత బాలకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్‌ఎం అశ్వత, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో రన్నర్స్‌గా పాముగానిపల్లె



ఖోఖో రన్నర్స్‌గా నిలిచిన పాముగానిపల్లె విద్యార్థులు

వి.కోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలో ఎస్‌జీఎఫ్‌ఐ నిర్వహించిన డివిజనల్ స్థాయి ఖోఖో పోటీల్లో వి.కోట మండలం పాముగానిపల్లె ఉన్నత పాఠశాల బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. మంగళవారం నిర్వహించిన ఖోఖో పోటీల్లో పలు జట్లపై గెలిచిన పాముగానిపల్లె అండర్-17 బాలికల జట్టు ఫైనల్స్‌లో బంగారుపాళ్యం జట్టుతో తలపడి రన్నర్స్‌గా నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన లక్ష్మీ, స్నేహ, నవ్యలను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం భాస్కర్ తెలిపారు. రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందించారు. అలాగే బాలుర విభాగంలోనూ జిల్లా ఖోఖో జట్టుకు గజేంద్ర, భువన్ ఎంపికైనట్లు పీడీ హరిప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ హరిప్రసాద్‌ను హెచ్‌ఎం భాస్కర్, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పత్రాలు దారిపోయినది

పి. మొగిలీశ్వర తండ్రి పి. వెంకటస్వామి, డోర్ నెం.సి-బ్లాక్-7 జానకారపల్లి, పోలీసు క్వార్టర్స్, చిత్తూరు టౌన్, మండలం, చిత్తూరు జిల్లాలో కాపురం యుండు నా పేరిట గల చిత్తూరు జిల్లా గంగవరం మండలం చిన్నూరు గ్రామం, డోర్ నెం. 7-95 సర్వే నెంబరు 595-1 పత్రం నెం.-1432/2015, డాక్యుమెంట్స్ దారిపోయినది. ఆచూకి తెలిసిన వారు ఈ క్రింది సెల్ నెంబరు తెలియజేయగలరు.

95500 69622

అంబేడ్కర్ విగ్రహానికి రూ.లక్ష వితరణ

వెదురుకుప్పం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహానికి కూటమి ప్రభుత్వం తరపున రూ.లక్ష వితరణను కలెక్టర్ సుమిత్ కుమార్‌కి ఏపీ మాల కార్పొ రేషన్ డైరెక్టరు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న మంగళవారం కార్వేటినగరంలో అందజేశారు.

వర్షాలకు ప్రజలు
అప్రమత్తంగా ఉండాలి

రొంపిచెర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఎడతెరిపిలేని వర్షాల కారణంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వాగులు, వంకల వద్దకు ఎవరూ వెళ్లరాదని, ఇళ్లు దెబ్బతిన్నా, చెరువు కట్టలు తెగేపోయే పరిస్థితులున్నా ఫోన్‌నంబరు 6309641900 ను సంప్రదించాలని కోరారు. గ్రామాల్లో వీఆర్వోలను అందుబాటులో ఉంచామని తెలిపారు.

సిగరెట్ కోసం ఘర్షణ

కుప్పం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని యలాజనూరులో జరిగిన ఘర్షణలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య కథనం మేరకు.. సోమవారం అర్ధరాత్రి సమయంలో కొంతమంది వ్యక్తులు యలాజనూరులోని చిల్లర దుకాణానికి వెళ్లారు. తాము అడిగిన సిగరెట్ ఇవ్వలేదన్న కారణంతో దుకాణదారుడు నాగరాజుపై దాడి చేశారు. దీనిపై ముగ్గురిపై కేసు నమోదైంది.

రైతు కుటుంబాల్లో సంతోషం

రామకుప్పం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుండటంతో రైతుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని తెలుగు రైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ, గోకులం షెడ్లు, సబ్సిడీ ధరలకు వివిధ రకాల విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు దన్నుగా నిలుస్తోందని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలకు గురైన మామిడి రైతులకు టన్నుకు రూ.4 వేలు చెల్లించిందన్నారు. కుప్పంతోపాటు రాష్ట్రంలో ఎక్కడా ఏ ఒక్క ఎకరా సాగుభూమి బీడుగా ఉండరాదని, తాగునీటి సమస్య తలెత్తరాదన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు అపర భగీరథ ప్రయత్నం చేశారని తెలిపారు. రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని ఆయన తెలిపారు.

అప్పు తీర్చలేక ఆత్మహత్యాయత్నం



గాయపడిన కిరణ్

పుంగనూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని మేలుందొడ్డి గ్రామానికి చెందిన బాబు కుమారుడు కిరణ్ (26) పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌పై కారు కొనుగోలు చేశాడు. సకాలంలో ఫైనాన్స్ కంపెనీకి చెల్లించాల్సిన కంతులు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి కిరణ్‌ను డబ్బు కట్టాలని ఒత్తిడి చేశారు. దీంతో తండ్రి బాబు తన కుమారుడు కిరణ్‌ను మందలించడంతో కిరణ్ కోపంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు. చుట్టుపక్కల వారు గుర్తించి మంటలను అదుపుచేసి చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నచికేత్‌రెడ్డికి ప్రముఖుల శుభాకాంక్షలు



నచికేత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే జగన్మోహన్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి తదితరులు

కల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మాజీ ఎంపీపీ స్వర్గీయ వారణాశి మధుసూదన్‌రెడ్డి కుమారుడు యువ పారిశ్రామికవేత్త వారణాశి నచికేత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు సోమవారం పులిచెర్ల బీవీ రెడ్డి బంగ్లా ఆవరణలో ఘనంగా నిర్వహించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వీరికి మాజీ ఎంపీపీ స్వర్గీయ మధుసూదన్‌రెడ్డి సతీమణి వారణాశి సౌమినిరెడ్డి ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాధంనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఢిల్లీ హోంమంత్రి



మంత్రికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ రాష్ట్ర హోమ్ శాఖ, విద్యా శాఖ మంత్రి ఆశిష్‌సూద్ మంగళవారం రాత్రి కుటుంబ సమేతంగా వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి ఆలయంలో దీపావళి ఆస్థానం



తిరువీధి ఉత్సవానికి వెళ్తున్న స్వామి, అమ్మవార్లు

వెదురుకుప్పం, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్య భామ సమేత వేణుగోపాలస్వామి ఆల యంలో సోమవారం దీపావళి ఆస్థానం నిర్వహించారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. స్నపన తిరుమంజనం జరిపించారు. సోమవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా దీపావళి సంబరాలు

● భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర నోముల వ్రతం



కల్లూరు : దేవళంపేట కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నోములు



చౌడేపల్లెలో కేదారీశ్వర నోములు నోచుకుంటున్న భక్తులు



కుప్పంలో చిన్నారుల సందడి



రామకుప్పంలో కొలువుదీరిన కేదారేశ్వరీదేవి



రామకుప్పంలో కేదారేశ్వరీదేవి వ్రతంలో భక్తులు

కుప్పం, పుంగనూరు, పలమనేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురం, కుప్పం మండలాల్లోని అన్ని గ్రామాల్లోనూ సోమ, మంగళవారాల్లో ప్రజలు దీపావళి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు బాణాసంచా పేలుళ్లతో గ్రామాలు దద్దరిల్లాయి. ఇంటింటా దీప కాంతులతో కళకళలాడింది. మట్టి ప్రమిదలు, కొవ్వొత్తులు వెలిగించి చీకట్లను పారదోలారు. టపాసుల పేలుళ్లతో చెడును తరమికొట్టారు. పిల్లలు, పెద్దలు, పేద గొప్పా తారతమ్యం లేకుండా కులమతాలకతీతంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. మంగళవారం నాడు ముత్తైదువులు, యువతులు కేదార గౌరీ వ్రతమాచరించారు. పండ్లు, పూలు, పిండి వంటలతో గౌరీదేవిని పూజించారు. అనంతరం వ్రతంలో ఉంచిన పసుపు తోరాలను ధరించి శుభాలు ప్రసాదించమని వేడుకున్నారు. మంగళవారం అమ్మవారి ఆలయాలు, వ్రతమాచరిస్తున్న మహిళలతో నిండిపోయాయి. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పూజలు జరిగాయి. అలాగే పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లోనూ పండుగ సందడి నెలకొంది. మహిళలు అమ్మవారి ఆలయాల్లో నోములు నోచుకున్నారు.



రొంపిచెర్లలోని శివాలయంలో వ్రతంలో మహిళలు



పుంగనూరులోని అన్నపూర్ణాదేవి ఆలయంలో పాల్గొన్న భక్తులు



బైరెడ్డిపల్లె : అలంకరణలో బాటగంగమ్మ



వి.కోటలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు



వి.కోట : నోములు నోచుకునేందుకు హాజరైన మహిళలు

నిరంతర కృషితో లక్ష్యాల సాధన

చిత్తూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం కృషిచేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మదనపల్లి యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల తమిళనాడు రాష్ట్రం ఊటీలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో వివిధ పతకాలు సాధించిన కరాటే విద్యార్థులు మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఏపీ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు చెంగల్రాయ నాయుడు, కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మణిసాయి పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళులు



రాళ్లబూదుగూరులో ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐలు, సిబ్బంది

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్‌ఐ నరేష్, ట్రైనీ ఎస్‌ఐ తేజస్విని రోడ్డు భద్రత, మహిళా రక్షణ, సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



బైరెడ్డిపల్లెలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

● **బైరెడ్డిపల్లె:** పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ మౌనం పాటించారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లె ఎస్‌ఐ జయశ్రీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.గొల్లపల్లెలో వర్షానందం

● మొరవలు పోతున్న కొత్త , నారెమ్మ చెరువులు



జలకళతో నారెమ్మ చెరువు



కొత్తచెరువు మొరవ వద్ద యువకుల పూజలు

రామకుప్పం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని అటవీ ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతుల్లో సంతోషాన్ని నింపుతున్నాయి. గత కొన్నేళ్లు వానలు పడక చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు ఎండిపోయాయి. దీంతో భూగర్భజలాలు తగ్గిపోయి వ్యవసాయం కష్టతరంగా మారింది. ఈసారి కురుస్తున్న వర్షాలు అన్నదాతకు అవస్థల నుంచి విముక్తి కల్గించాయి. ముఖ్యంగా మండల పరిధి పంద్యాలమడుగు, సింగసముద్రం, 89పెద్దూరు, వీర్నమల, ముద్దనపల్లె బల్ల పంచాయతీల పరిధిలో వానలు అధికంగా పడ్డాయి. అటవీప్రాంతంలో కురిసిన వర్షపునీరు ఆయా గ్రామాల్లో పరిధిలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు చేరుతున్నాయి. పలుచోట్ల అవి నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. పంద్యాలమడుగు పంచాయతీ ఎస్.గొల్లపల్లె అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలతో స్థానిక కొత్తచెరువు, నారెమ్మ చెరువులు నిండు కుండల్లా కళకళలాడుతున్నాయి. గత రెండు రోజులుగా మొరవలు పారుతున్నాయి. స్థానికులు మొరవల వద్ద పూజలు చేసి జలహారతులు ఇస్తున్నారు.



నిండు కుండలా ఎస్.గొల్లపల్లె కొత్తచెరువు



కొత్తచెరువు మొరవ ప్రవాహం



మొరవ పారుతున్న నారెమ్మ చెరువు

వర్షాలు.. జనం కష్టాలు



చీలాపల్లె ఎర్రమాలు వంక వద్ద జారిపడ్డ ద్విచక్ర వాహనదారుడు

గుడిపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ము ఖ్యంగా పేయనపల్లె క్రాస్ నుంచి చీలాపల్లెకు, గుడిపాల క్రాస్ నుంచి చిత్తపారకు, నార గల్లు చెరువుకట్ట వైపు వెళ్లాలంటే ప్రజలు పడుతున్న బాధ లు వర్ణ ణాతీతం. ఈ రహదారిలో పది రోజులుగా వర్షపు నీరు ఎక్కువగా ప్రహిస్తు న్నందున రహదారిపై పాచి పేరుకు పోయి వాహనదారులు, పాదచారులు జారి పడుతున్నారు. మంగళవారం చీలాపల్లె గ్రామానికి చెందిన ఎర్రమాలు వంక వద్ద ద్విచక్ర వాహనం బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారిలో వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సులకు గ్రామస్తుల ఆయుధ పూజ



టీపీఎస్ఆర్.పురంలో బస్సులకు ఆయుధ పూజ చేస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రెడ్డెప్ప, శ్రీరంగరాజపురం ఎస్ఐ సుమన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ● మండలంలోని టీపీఎస్ఆర్‌పురం గ్రామం నుంచి బెంగళూరుకు, చిత్తూరుకు నడిచే రెండు ఆర్టీసీ బస్సులకు గ్రామస్తులు ఘనంగా ఆయుధ పూజ చేసి డ్రైవర్, కండక్టర్లను శాలువాలతో సత్కరించి స్వీట్లను అందించారు.

ఆలపాక కండ్రిగలో పశువైద్య శిబిరం

విజయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలపాక కండ్రిగలో మంగళవారం పశువైద్యాధికారి శివమూర్తి రాష్ట్రీయ పశుగణాభివృద్ధి సంస్థ, గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాకాలంలో పశువులకు వస్తున్న వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. 30 పశువులకు గర్భకోశవ్యాధులకు మందులు పంపిణీ చేశారు. 130 పశువులకు పిడుదుల నివారణ మందులు పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో నింద్ర పశువైద్య సంచాలకులు మునిలక్ష్మీపతి, ఏపీఎల్డీఏ సుబ్బారావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరపిలేని వర్షం



పాతార్కాడులో వరిపొలంలో చేరిన నీరు

విజయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఎడ తెరపిలేకుండా విస్తారంగా వర్షం కురిసింది. పంట పొలాలు మునిగే దశకు చేరాయి. చెరువులకు జలకళ సంతరించుకుంది. వర్షపాతం మరింత నమోదయ్యే అవకాశాలున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్ సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండేవారు సురక్షితమైన ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు.

వరసిద్ధుడి ఆలయ వాహనాలకు పూజ



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి చెందిన వాహనాలకు మంగళవారం వాహన పూజను ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలకు ఈవో కార్యాలయం పక్కన విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రవీంద్రబాబు, ధనంజయ, హరిమాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువ తవ్వారు..కట్టడం మరిచారు..!



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జానకారపల్లిలోని 23వ డివిజన్ పరిధిలో హోసన్న చర్చి సమీపంలోని వీధుల్లో మురుగు కాలువ నిర్మాణాల కోసం మున్సిపల్ సిబ్బంది గుంతలు తవ్వారు. కానీ నిర్మాణాలు మాత్రం చేపట్టలేదు. నెలల తరబడి తవ్విన గుంతలు అలాగే దర్శన మిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వెళ్లకపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మరో వైపు దోమల బెడదతో జ్వరాల భయం వెంటాడుతోంది. కాలువ నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు.

చిత్తూరులో ముసురువాన





చిత్తూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరులో మంగళవారం ముసురువాన పట్టుకుంది. ఉదయం నుంచే చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. మధ్యాహ్నం పైన ఓ మోస్తరు వర్షం పడింది. నోములు నోచుకోవడానికి ఆలయాల వద్దకు వెళ్లిన వారంతా కొంత ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు వర్షం పడుతూనే ఉండటంతో వీధులంతా బురదమయంగా మారాయి. ప్రయాణాలు చేసే వారు ఇబ్బందులు పడ్డారు.



వేట కోసం కరెంటు తీస్తే కేసులు తప్పవు

తవణంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల వేట కోసం అక్రమంగా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేస్తే కేసులు పెడతామని డీఈఈ అరుణ్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని టి.పుత్తూరు, మారేడుపల్లె గ్రామ సమీపాల్లోని అటవీ ప్రాంతాల్లో గల మామిడి తోటల్లో గుర్తు తెలియని వ్యక్తులు అడవి జంతువుల వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లలను స్వాధీనం చేసుకున్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడికి పరామర్శ

గుడిపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి, బీసీ సెల్ అధ్యక్షుడు జయచంద్రను ఎమ్మెల్యే జగన్మోహన్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ సీఎన్. రాజన్ మంగళవారం రాణిపేట సీఎంసీలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతనిధి హేమాద్రినాయుడు, మండల టీడీపీ సీనియర్ నాయకులు పయణిగౌడ్, మురళినాయుడు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కరువు భత్యం జీవో సవరించండి : ఎస్టీయూ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యంపై విడుదల చేసిన జీవోను సవరించాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్, బి.మోహన్‌లు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్య సంఘాల సమావేశంలో సీఎం చేసిన ప్రకటనకు భిన్నంగా కరువు భత్యం జీవోను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జీవోను సవరించి, ఉద్యోగులకు డీఏ బకాయిలను వారి పీఎఫ్ ఖాతాలో జమ చేసేలా చూడాలని, సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రూపంలో చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

30న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలు

చిత్తూరు క్రీడలు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని డీఎస్ఏ మెసానికల్ మైదానంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలు ఈ నెల 30వ తేదీన జరుగుతాయని డీఎస్‌డీవో బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 19 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నామని, ఆసక్తిగల చిత్తూరు జిల్లాలోని సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ గెలుపొందిన వారు నవంబరు 5న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.

కన్నుల పండువగా దీపావళి

గుడిపాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా దీపావళిని పురస్కరించుకుని సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రతి ఇంటిలో అమ్మవారిని ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పిల్లాపాపలతో కలసి దీపావళి వేడుకలు నిర్వహించారు. పక్క రాష్ట్రాలలో నివసిస్తున్న గుడిపాల మండల వాసులు తమతమ గ్రామాలకు చేరుకుని పండుగ నిర్వహించారు.

తవణంపల్లె: మండలంలోని ప్రజలు దీపావళి పండుగను సంబరంగా చేసుకున్నారు. గ్రామాల్లోని పలు ఆలయాల్లో మహిళలు భక్తి, శ్రద్ధలతో పసుపుతో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి నోములు నోచుకున్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండండి

బంగారుపాళ్యం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు చెరువులు నిండి మొరవలు సాగుతున్నాయి. ప్రజలు వంకల వద్ద దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

గంజాయి బ్యాచ్‌ని అరెస్టు చేయండి



వెదురుకుప్పం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గంజాయి బ్యాచ్ ఆగడాలు శృతి మించిపోతున్నాయని, గంజాయి బ్యాచ్‌ని అరెస్టు చేయాలని ఆదివారం రాత్రి వెదురుకుప్పం పోలీసులకు మొండివెంగనపల్లె గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. రోజురోజుకీ గంజాయి బ్యాచ్ ఆగడాలు మితిమీరి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రొఫెసర్ రాఘవులు నాయుడు కన్నుమూత

● సీఎం చంద్రబాబుకు ఏడాది జూనియర్



ప్రొఫెసర్ రాఘవులు నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఎకనమిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ బొల్లినేని రాఘవులు నాయుడు (78) మంగళవారం కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ప్రొఫెసర్ రాఘవులు నాయుడు తిరుపతి విద్యానగర్‌లోని సత్యసాయి కాలనీలో స్వగృహంలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. పూతలపట్టు మండలం గాండ్లపల్లెకు చెందిన రాఘవులు నాయుడు నాలుగు దశాబ్దాల పాటు ఎకనమిక్స్ బోధన, పరిశోధన రంగాల్లో కృషి చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడుకు ఏడాది జూనియర్ కూడా. రాఘవులు నాయుడికి ముగ్గురు సంతానం. గురువారం ఉదయం స్వగృహంలో భౌతిక కాయాన్ని సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

● సహాయం కోసం 9849907885 ఏర్పాటు
● కమిషనర్ నరసింహప్రసాద్



చిత్తూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన నగరపాలక కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో నగరపాలక పరిధిలో ఇంజనీరింగ్, ప్రజారోగ్యం అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నీవానదిలో నీటిమట్టాన్ని అంచనా వేస్తూ పరివాహక ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలన్నారు. ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీము అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో సహాయం కోసం నగరపాలక కార్యాలయంలో 9849907885 నెంబరును ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం



నింద్రలో గౌరీవ్రతం నిర్వహిస్తున్న మహిళలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించు కున్నారు. సోమవారం దీపావళి సందర్భంగా టపా కాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. మంగళవారం నగరంలోని అన్ని ప్రముఖ ఆలయాల్లో కేదారేశ్వర వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పొన్నెమ్మ గుడి, సంతపేట వినాయకస్వామి గుడి, మురకంబట్టు విరూపాక్షమ్మ ఆలయం, దొడ్డిపల్లిలోని సప్తకన్నికలమ్మ ఆలయంతో పాటు నగరంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా మహిళలు కేదారేశ్వరవ్రతంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నింద్ర: మండలంలోని ఆలయాల్లో కేదారనాథ గౌరీవ్రతం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు కలశ స్థాపన, వినాయక పూజ నిర్వహించి అభిషేకం చేశారు. పూలమాలలతో విశేషంగా అలంకరించారు. కేదారనాథ గౌరీవ్రత విశిష్టతను వివరిస్తూ నోము దారాలకు పూజలు చేయించారు. అనంతరం నోముదారాలను మహిళలు ధరించారు.

నగరి: మున్సిపల్, మండల పరిధిలో ప్రజలు సోమవారం దీపావళి పండుగ జరుపుకున్నారు. చిన్నారులు కొత్త దుస్తులు ధరించి టపాకాయలు పేలుస్తూ ఆనందంగా పండుగ చేసుకున్నారు. సోమవారం దేవీ ఆలయాల్లో కేదారగౌరీ వ్రతాన్ని భక్తిప్రపత్తులతో చేశారు. వేద పండితులు ముత్తయి దువులకు నోముదారాలు ఇచ్చి ఆశీస్సులు అందజేశారు.







చిత్తూరులోని మొదలియార్ సత్రంలో, సంతపేట వినాయకస్వామి ఆలయంలో, నగరిలో కేదారేశ్వర వ్రతం చేస్తున్న భక్తులు

నిరంతర కృషితో ఉన్నతస్థాయికి: ఎమ్మెల్యే గురజాల



ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కరాటే విద్యార్థులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతరం కృషిచేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మదనపల్లి యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల తమిళనాడు రాష్ట్రం ఊటీలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో వివిధ పతకాలు సాధించిన కరాటే విద్యార్థులు మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు చెంగ్రాయనాయుడు, మదనపల్లి యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మణిసాయి పాల్గొన్నారు.

ఇల్లు కోల్పోయిన బాధితురాలికి రెడ్‌క్రాస్ చేయూత



కుమారికి వంట సామగ్రి అందజేస్తున్న జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి సహదేవనాయుడు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఇల్లుకోల్పోయిన బాధితురాలికి రెడ్‌క్రాస్ తరఫున చేయూత అందించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లెలోని వృద్ధురాలు కుమారికి చెందిన ఇల్లు పడిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకుని జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సహదేవనాయుడు, లైఫ్‌మెంబర్ హరిక్రిష్ణారెడ్డి మంగళవారం ఎల్లమరాజుపల్లెలో బాధితురాలు కుమారికి టార్పిలిన్ పట్ట, వంట సామగ్రి బాధితురాలికి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గోపి, జిల్లా కో-ఆర్డినేటర్ చిరంజీవి పాల్గొన్నారు.

నగరిలో వర్షం - స్తంభించిన జనజీవనం



నగరి సీఎస్ఐ ఆస్పత్రి వద్ద నాగలాపురం రోడ్డుపై వర్షపునీరు

నగరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో జన జీవనం స్తంభించింది. నగరి మున్సిపల్ పరిధిలోని నాగలాపురం రోడ్డులో గల సీఎస్ఐ ఆస్పత్రి వద్ద వరద నీరు నిండిపోవడంతో వాహనదారులు తిప్పలు పడ్డారు. డ్రైనేజీ సక్రమంగా లేక పోవడంతో నీరు రోడ్డుపై నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

వరసిద్ధుడి సేవలో ఢిల్లీ హోమ్ మంత్రి



మంత్రికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డిల్లీ రాష్ట్ర హోమ్ శాఖ, విద్యా శాఖ మంత్రి ఆశిష్‌సూద్ మంగళవారం రాత్రి కుటుంబ సమేతంగా వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి ఆలయంలో దీపావళి ఆస్థానం



తిరువీధి ఉత్సవానికి వెళ్తున్న స్వామి, అమ్మవార్లు

వెదురుకుప్పం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం దీపావళి ఆస్థానం నిర్వహించారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. స్నపన తిరుమంజనం జరిపించారు. సోమవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

వానకు నేలవాలిన వరి, దెబ్బతిన్న రోడ్డు

ఐరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ముసురు వానకు ఐరాల మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి వర్షం ఓ మోస్తారుగా కురవడంతో వీఎస్.అగ్రహారంలో వరి పంట కొంత మేర నేలకొరిగింది. వీఎస్.అగ్రహారంలోని ఈద్గా వద్ద రోడ్డు దెబ్బతింది. ఈ మార్గంలో ప్రయాణించ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో మఠంపల్లిమిట్ట శివాలయం ఉంది. ఈ మార్గం పూర్తిగా దెబ్బతినడంతో కార్తీక మాసం పూజలకు ఆలయాలకు వెళ్లడానికి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో నూతన బీటీ రోడ్డు వేయాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.





నేల వాలిన వరి, వీఎస్.అగ్రహారంలో దెబ్బతిన్న రోడ్డు

మాజీ మంత్రి రోజా ఇంట దీపావళి సంబరాలు



టపాకాయలు కాలుస్తున్న రోజా, రవళి

నగరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని మాజీమంత్రి రోజా ఇంట ఆదివారం సందడి నెలకొంది. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాల్చారు. సంప్రదాయ పద్ధతిలో ఇంటి వద్దే కేదారగౌరీ ధనలక్ష్మి వ్రత మాచరించారు. వాహనాలకు ఆయుధపూజ చేశారు. నటి రవళి అతిథిగా విచ్చేసి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రోజా భర్త సెల్వమణి, కుమారుడు కృష్ణకౌశిక్, సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణేశ్వరుడికి పూజలు



వెదురుకుప్పం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ పర్యవేక్షించారు.

బంగారమ్మకు విశేష పూజలు



వెదురుకుప్పం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు చేశారు. అభిషేకాలు చేశారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించు కున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

వైభవంగా కేదారేశ్వరి వ్రత పూజలు



గంగాధరనెల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లియెల్లమ్మ గుడిలో గంగాధరనెల్లూరు అల్లియెల్లమ్మ గుడిలో మంగళవారం అర్చకులు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో మహిళలు కేదారేశ్వరి గౌరివ్రతం పూజలు చేశారు. పలువురికి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి రూ.లక్ష వితరణ



వెదురుకుప్పం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహానికి కూటమి ప్రభుత్వం తరఫున రూ.లక్ష వితరణను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కి ఏపీ మాల కార్పొరేషన్ డైరెక్టరు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న మంగళవారం కార్వేటినగరంలో అందజేశారు.